# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **అమరావతిలో వరుస అగ్ని ప్రమాదాలపై విచారణకు ఆదేశించామని వెల్లడించిన హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత .**

3. **భక్తుల రద్దీకి తగినట్లుగా గోదావరి పుష్కరాల ఘాట్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ.**

4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం.**

============================

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ 2.0 పై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో ఈరోజు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ పాల్గొనగా, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అమరావతి నుంచి దృశ్య మాధ్యమ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ... జల్ జీవన్ మిషన్ అమలుపై సమగ్ర విధానాన్ని ప్రకటించిందన్నారు.

---------------------------

అమరావతిలో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతుండటంపై విచారణకు ఆదేశించామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అమరావతిలోని రాయపూడి సమీపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల బంగ్లాల వద్ద గత అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రి ఈ రోజు ఒక ప్రకటనలో స్పందించారు. అమరావతిలో జరిగిన అగ్నిప్రమాదాన్ని ఐదు అగ్నిమాపక శకటాలతో అదుపులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, పోలీసు శాఖ అన్ని కోణాల్లో ఈ ప్రమాదంపై విచారణ చేపడుతోందని మంత్రి అనిత వివరించారు.

---------------------------

రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ –ఆర్డీటీకు విదేశీ నిధుల అంశంలో ఉన్న సమస్య పరిష్కరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా ముఖ్యమంత్రి ఈరోజు స్పందిస్తూ, రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది గ్రామాల్లో పేదలకు వివిధ రకాల సేవలు అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వ వినతిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం నిధుల సేకరణకు ఆర్డీటీని అనుమతించడం ద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ అంశంపై బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ..

.. వాయిస్.. 25 సెకన్లు

---

భక్తుల రద్దీకి తగినట్లుగా గోదావరి పుష్కరాల ఘాట్లను అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం పుష్కర ఘాట్లలలో జరుగుతున్నఅభివృద్ధి పనులను మంత్రి నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కొవ్వూరు పురపాలక కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ,

వాయిస్ ..25.. సెకన్లు

---

విశాఖపట్నం సింహాచలంపై కొలువై ఉన్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. చందనోత్సవం ఏర్పాట్లపై విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైశాఖ శుద్ధ తదియ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 20వ తేదీన సింహాచలం క్షేత్రంలో నిజరూప దర్శనం, చందనోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

---

ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ సంస్థ సంయుక్త సంచాలకులు రమేష్ తెలిపారు. విజయవాడలో జరిగిన ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన అవగాహనా ర్యాలీని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తుందని రమేష్ తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య, విజ్ఞాన సంస్థ – ఎయిమ్స్ లో మరో అత్యాధునిక వైద్య సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చామని ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్. అహంతెం శాంతా సింగ్ తెలిపారు. న్యూక్లియర్ వైద్య విభాగంలో గామా కెమెరా, హై డోస్ థెరపీ విభాగాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతా సింగ్ మాట్లాడుతూ, ఈ అధునాతన సౌకర్యాల ఏర్పాటు న్యూక్లియర్ రోగ నిర్ధారణలో కచ్చితత్వాన్ని, చికిత్సా సామర్థ్యాలను మెరుగుపరుస్తుందని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ అత్యాధునిక వైద్య పరికరాలతో దాదాపుగా అన్నీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

---------------------------

ఉద్యానవన రంగంలో విద్యార్థులకు గొప్ప అవకాశాలు ఉన్నాయని పార్వతీపురంమన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పార్వతీపురంలోని ఉద్యాన కళాశాలలో 12వ అంతర్ కళాశాల సాంస్కృతిక, సాహిత్య సమ్మేళనం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో కృతిమ మేధ -ఎఐ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఎన్ని విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ, ఉద్యాన రంగానికి ఉన్న ప్రాముఖ్య ఆవశ్యకత ఎప్పటికీ తగ్గదని అన్నారు. మొక్కల పెంపకం, ఉద్యాన రంగం వంటి ప్రాకృతిక అంశాల్లో మానవ ప్రమేయం, విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

---------------------------

ఆధునిక సాంకేతిక విద్యల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం – జేఎన్టీయూ ఉపకులపతి సుదర్శన రావు తెలిపారు. అనంతపురంలోని జేఎన్టీయూలో నిర్వహించిన "జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు" కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన రావు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే నూతన ఆవిష్కరణలవైపు దృష్టి సారించాలన్నారు. సాంకేతిక విద్య అంశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

---------------------------

విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నవరాత్రులలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, పుష్పార్చనలు నిర్వహిస్తున్నారు. కాగడ మల్లెలు, మరువం, చామంతి వంటి పుష్పాల ప్రత్యేక అలంకరణలో అమ్మవారు ఈరోజు భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

---------------------------

భారతీయ చేనేతకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ వారసత్వాన్ని కాపాడుకోవాలని చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా పేర్కొన్నారు. చేనేత పరిరక్షణ పథకం, హ్యాండ్లూమ్ ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టం, 1985 అమలు పై విజయవాడలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ... హ్యాండ్‌లూమ్ చట్టం-1985ను కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పవర్‌లూమ్ ఉత్పత్తులను చేనేత పేరుతో విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసలైన చేనేత ఉత్పత్తులను గుర్తించేందుకు సిల్క్ మార్క్, హ్యాండ్‌లూమ్ మార్క్ వంటి గుర్తింపు చిహ్నాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

======================